సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం | 16 | మే | 2025



క్రీడా కోటాపై తలోమాట

డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా విధివిధానాలపై క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

8లో ▸



జలాశయంలోనూ తవ్వకాలు

కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయంలో అక్రమంగా తవ్వకాలు చేయడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి.

8లో ▸



'ఆట'విడుపు

ఏలూరులో బాస్కెట్‌బాల్ శిక్షణ ఉత్సాహంగా సాగుతోంది. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు.

8లో ▸

రూ.75 కోట్ల పనులు రద్దు!

ప్రజల ఆశలు ఆవిరి

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్రోచ్‌లు, రోడ్లకు నిధులు
- టెండర్ల దశకు చేరిన పనులకు బ్రేక్ వేసిన కూటమి సర్కారు
- ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యేలు
- పనులు కొనసాగించాలని వినతి



యనమదుర్రు డ్రెయిన్‌పై గొల్లవానితిప్ప వద్ద ప్రమాదభరితంగా అప్రోచ్ రోడ్డు

సాక్షి, భీమవరం: ఏళ్ల తరబడి పట్టి పీడిస్తున్న సమస్యలకు త్వరలో పరిష్కారం లభిస్తుందన్న ప్రజల ఆశలపై కూటమి నీళ్లు చల్లింది. టెండర్ల దశకు చేరిన రూ.75.28 కోట్ల విలువైన ఏడు పనులకు బ్రేక్ వేసింది. ఆ పనులు మొదలు పెట్టాలని కూటమి నేతలు కోరినా ఫలితం లేదు. సమస్యను ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పనులు జరిగేట్టు చూడాలని కోరినట్టు సమాచారం.

అప్రోచ్‌లకు మోక్షం కలిగేనా?

డెల్టా ఆధునికీకరణలో భాగంగా దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లాలో భీమవరం నియోజకవర్గంలోని యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనల నిర్మాణానికి రూ.110 కోట్లు మంజూరు చేశారు. గొల్లవానితిప్ప, దొంగపిండి, పట్టణంలో రెస్ట్‌హౌస్ రోడ్డు వద్ద వంతెనలు నిర్మించారు. నిధులు చాలక అప్పట్లో అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు అదుపుతప్పి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానిక నాయకులు నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా ఆయన స్పందించి అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.36.71 కోట్లు మంజూరు చేశారు. వీటిలో కాళీపట్నం–భీమవరం వంతెన వద్ద రూ.9.22 కోట్లు, భీమవరం–దొంగపిండి వంతెన వద్ద రూ.16.58 కోట్లు, దెయ్యాలతిప్ప–నాగిడిపాలెం వంతెన వద్ద రూ.10.91 కోట్లు మంజూరై టెండర్ ప్రక్రియ ప్రారంభం కాగా ఈలోపు ఎన్నికలు రావడంతో పనులకు బ్రేక్ పడింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టేసింది.

అవసరమని చెప్పినా.. ఆయా పనుల ఆవశ్యకత దృష్ట్యా పనులు రద్దు కాకుండా కొనసాగించాలని కూటమి నేతలు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. ఇటీవల జిల్లాకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి ప్రజాప్రతినిధులు ఈ విషయం తీసుకువెళ్లారు. రద్దు చేయకుండా వాటిని కొనసాగించాలని కోరగా ప్రభుత్వంతో మాట్లాడతానని ఆయన చెప్పినట్టు సమాచారం. కాగా ఆ పనులకు మరలా అంచనాలు రూపొందించి, ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపితే సాంకేతిక, పాలన అనుమతులు వచ్చి, టెండర్ ప్రక్రియ మొదలయ్యేసరికి చాలా సమయం పడుతుందని పలువురు అంటున్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అటకెక్కిన పనులు



బొండాడ డ్రెయిన్‌పై ఇరుకు వంతెన

- గత ప్రభుత్వంలో ఉండి నియోజకవర్గంలోని చినమిల్లిపాడు, సిద్ధాపురం, రాజులపేట, రాజుల కొట్టాడ, ధర్మాపుర అగ్రహారం, నల్లమిల్లిపాడు గ్రామాలు, కొల్లేరు తీర ప్రాంత ప్రజలు, రైతులు చినమిల్లిపాడు–ఆకివీడు మెయిన్‌రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదభరితంగా ఉన్న ఈ రోడ్డును 11.6 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు చేపట్టి అభివృద్ధి చేసేందుకు రూ.25 కోట్లు మంజూరయ్యాయి.
- భీమవరం నుంచి కలిదిండి మీదుగా గుడివాడ వెళ్లే రోడ్డులోని బొండాడ డ్రెయిన్లపై వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేశారు.
- ఆచంట నియోజకవర్గంలో నెగ్గిపూడి, తాడేపల్లిగూడెంలో ఆర్‌అండ్‌బీ ఇన్‌స్పెక్షన్ బంగ్లాల ఆధునికీకరణ నిమిత్తం రూ.1.57 కోట్లు మంజూరు చేశారు. ఆయా పనులు దాదాపు టెండర్ల దశకు చేరుకోగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అటకెక్కించింది.

మానసిక దివ్యాంగుల సంరక్షణకు చర్యలు



ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశంచౌక్): తల్లిదండ్రులు లేని మానసిక, బహుళ వైకల్యాలు గల బిడ్డల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ట్రస్ట్ యాక్ట్ పై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మానసిక, బహుళ వైకల్యాలు ఉన్న పిల్లల పెంపకం, ఆహారం తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని ఏడుగురు విభిన్న ప్రతిభావంతులకు ఒక్కోటి రూ.38 వేల విలువైన ల్యాప్‌టాప్‌లను అందజేశారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు బి.రామ్‌కుమార్, కమిటీ సభ్యులు అంజలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిటేషన్ ప్రతినిధి ప్రసాద్, దివ్యాంగ మహా సంఘటన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎస్ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వడగాల్పులపై అప్రమత్తం

జిల్లాలో ఎండ తీవ్రత కారణంగా వడగాల్పును తట్టుకునేందుకు ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ ద్వారా స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సమీక్షించారు. ఈనెల 17న 'బీట్ ద ఈట్' థీమ్‌తో కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు.

న్యూస్‌రీల్

ఎక్సైజ్ ఏసీ తనిఖీలు



అధికారులతో మాట్లాడుతున్న ప్రభుకుమార్

తణుకు అర్బన్: తణుకు ఎక్సైజ్ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల్లోను తక్షణమే చార్జ్‌షీట్స్ వేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.నాగ ప్రభుకుమార్ ఆదేశించారు. గురువారం తణుకు ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన తనిఖీలు చేశారు. గంజాయి, డ్రగ్స్ తదితర కదలికలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం తణుకు శివారులోని ఆంధ్రా డిస్టిలరీస్, వాన్‌బెర్రీ ప్రైవేట్ లిమిటెడ్‌లోని మిథనాల్, ఆర్ఎస్ యూనిట్‌లను పరిశీలించారు. రసాయనాల వాడకంలో లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. పెండింగ్ కేసుల రిజిస్టర్లను పరిశీలించారు. ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు 24 వరకు గడువు

ఉండి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఈనెల 24న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఐటీఐ జిల్లా కన్వీనర్, ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను (ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం, ఆచంట) సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో వెరిఫికేషన్ చేయించుకుని రశీదు పొందాలని, వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులని తెలిపారు. వివరాలకు నేరుగా లేదా ఫోన్ 08816 297093, 9676099988 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఈసెట్‌లో ఆకివీడు విద్యార్థినికి ఫస్ట్ ర్యాంక్



కొట్టు గంగాభవానీ

ఆకివీడు: జేఎన్‌టీయూ అనంతపురం నిర్వహించిన ఏపీఈసెట్–2025 పరీక్షలో బీఎస్సీ స్ట్రీమ్‌లో ఆకివీడు మండలం తరటావకు చెందిన కొట్టి గంగాభవానీ రాష్ట్రస్థాయిలో 95 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించింది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే దళిత కుటుంబానికి చెందిన కొట్టి కాశీ విశ్వనాథం, ధనలక్ష్మి దంపతుల కుమార్తె గంగాభవానీ మండలంలోని తరటావ, చినకాపవరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో పదో తరగతి వరకు చదివింది. ఇంటర్ హనుమాన్ జంక్షన్‌లోని జేఎస్‌జీ జూనియర్ బాలికల కాలేజీలో పూర్తిచేసి, డిగ్రీ ఏలూరులోని సీహెచ్ఎస్‌డీ థెరిస్సా అటానమస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్, మ్యాథ్స్‌లో 93 శాతం మార్కులు సాధించింది. ఈసెట్ కోసం ఇంటి వద్ద నుంచి ప్రిపేర్ కాగా 95 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. బీటెక్ కంప్యూటర్స్ చదవాలనే ఆశయంతో ముందుకు వెళుతున్నట్టు ఆమె తెలిపింది. తల్లిదండ్రులు ఇద్దరూ నిర్లక్ష్యరాస్యులు కాగా ఆమె సోదరుడు అంధుడు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ

భీమవరం: జిల్లాలో గురువారం ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఫస్టియర్ జనరల్ కేటగిరీలో 8,281 మందికి 7,925 మంది, ఒకేషనల్ కేటగిరీలో 594 మందికి 535 మంది హాజరయ్యారు. సెకండియర్ జనరల్ కేటగిరీలో 1,049 మందికి 963 మంది, ఒకేషనల్ కేటగిరీలో 192 మందికి 173 మంది హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు తెలిపారు.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు 6,067 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫస్టియర్ పరీక్షలకు 5,059 మందికి 4,830 మంది, ఒకేషనల్ పరీక్షలకు 390 మంది హాజరయ్యారు. సెకండియర్ జనరల్ పరీక్షలకు 650 మందికి 601 మంది, ఒకేషనల్ పరీక్షలకు 269 మందికి 246 మంది హాజరయ్యారు.

విద్యాహక్కుకు విఘాతం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా విద్యాశాఖాధికారుల తీరుతో 98 మంది పేద విద్యార్థుల విద్యాహక్కుకు విఘాతం కలిగించారని ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటి వెంకటరమణ, తోట ప్రసాద్ ప్రకటనలో ధ్వజమెత్తారు. ఏలూరు రూరల్ మండలంలోని కండ్రికగూడెం ఎంపీయూపీ పాఠశాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 241 మంది విద్యార్థులుండగా ప్రాథమిక పాఠశాలలో 98 మంది విద్యార్థులున్నారని పేర్కొన్నారు. అయితే 98 మంది విద్యార్థులను కిలోమీటరుకు పైగా దూరమున్న మరో పాఠశాలకు తరలించడంతో వీరంతా చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.

చెత్త తొలగింపు



దొంగపిండిలో చెత్తకు నిప్పు పెట్టిన దృశ్యం

సాక్షి స్పందన

భీమవరం అర్బన్: 'పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. భీమవరం మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, దొంగపిండి తదితర గ్రామాల్లో, రోడ్ల మార్జిన్లలో పేరుకున్న చెత్తను తొలగించి నిప్పు పెట్టారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. గ్రామస్తులు, వాహనచోదకులు, ప్రయాణికులు దుర్గంధం తొలగిందంటూ 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు చెత్త తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

కొల్లేరులో తుపాకుల మోత

గన్ కల్చర్

- పక్షులను తోలటానికి నాటు తుపాకుల వాడకం
- నల్లమందు వినియోగించి పేలుళ్లు
- నెల్లూరు, తమిళనాడు నుంచి వలస కూలీల రాక
- తుపాకుల మిస్‌ఫైర్‌తో తరచూ ప్రమాదాలు
- కొల్లేరు అక్రమ చెరువులన్నింటి వద్ద ఇదే పరిస్థితి
- గత నెలలో మందుగుండు పేలి నలుగురు మృతి
- రెండు రోజుల క్రితం ముగ్గురికి గాయాలు



ఉండిలో నాటు తుపాకీతో వేటగాడు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పక్షులను తోలే సంప్రదాయ వలస కూలీలు నాటు తుపాకులను వినియోగించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దశాబ్దాలుగా కొల్లేరులో నాటు తుపాకుల సంస్కృతి కొనసాగుతుండగా ఏటా పలువురు మృత్యువాత పడటం, గాయాల పాలవడం షరా మామూలుగా తయారైంది. పెద్ద పక్షులు చెరువుల్లోని చేపలను ఆహారంగా తీసుకోవడానికి వచ్చినప్పుడు నల్లమందు వినియోగించి తుపాకీ పేలుళ్ల శబ్దం చేస్తే కొన్ని గంటల పాటు చెరువు దరిదాపుల్లోకి రావు. దీంతో ఎక్కువ చెరువుల వద్ద గన్‌కల్చర్‌ను కొనసాగిస్తున్నారు. తాజాగా గత నెలలో మందుగుండు పేలి పది మంది గాయాలపాలై నలుగురు మరణించడం, అలాగే రెండు రోజుల క్రితం మిస్‌ఫైర్‌తో ముగ్గురు గాయాలైన ఘటన కొల్లేరులో చోటు చేసుకుంది.

చెరువుల కాపలా పనులు చేస్తూ..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు కృష్ణా జిల్లాలో 901 చదరపు కిలోమీటర్ల పరిధిలో 2,22,300 ఎకరాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. 12 మండలాల్లో 3.50 లక్షల మంది ప్రజలు కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. మంచినీటి సరస్సుగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. విదేశాల నుంచి శీతాకాలంలో లక్షల సంఖ్యలో పక్షులు వలస వచ్చి కొల్లేరులో గుడ్లు పొదిగి తిరిగి వెళ్తుంటాయి. ఏటా కొల్లేరుకు విదేశాల నుంచి లక్షన్నరకు పైగా వివిధ జాతుల పక్షులు వీటిలో అత్యధికంగా పెలికాన్ పక్షులు వస్తుంటాయి. కొల్లేరులో ఆక్రమణల పర్వం దశాబ్దాలుగా యథేచ్ఛగా సాగుతోంది. ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమ సాగు అనేది ఇక్కడ నిత్యకృత్యం. ఈ క్రమంలో కొల్లేరులో చేపల చెరువుల కాపలా పనులకు నెల్లూరు, తమిళనాడుకు చెందిన వలస కూలీల కుటుంబాలు నిర్వహిస్తుంటాయి. ప్రధానంగా పులికాట్ సరస్సు ప్రాంతం వద్ద ఉండే వీరు సీజన్‌లో ఇక్కడకు వచ్చి పనులు చూసుకుని వెళ్తుంటారు.

ప్రమాదం అంచున పని

స్థానికంగా కొల్లేరు ప్రాంతంలో నాటు తుపాకులు అద్దెకు ఇస్తుంటారు. కేవలం చెరువుల వద్దకు కాపలాకు మాత్రమే వీటిని వినియోగిస్తుంటారు. కొందరు వలస కూలీలు రోజూ కూలి కోసం ప్రమాద అంచున నిత్యం పనిచేస్తున్నారు. తుపాకుల పేలుళ్లు ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేక ఇదే పని చేస్తున్నారు. ప్రత్యేకంగా ఒక కులానికి చెందిన వారే నాటు తుపాకులతో పక్షులను వేటాడుతుంటారు. గత నెలలో కైకలూరు నియోజకవర్గం భైరవపట్నంలో ఇవే కుటుంబాలకు చెందిన ఒక ఇంట్లో మందుగుండు పేలి పది ఇళ్లు తగలబడి నలుగురు మృత్యువాతపడగా ముగ్గురికి గాయాలయ్యాయి. అలాగే రెండు రోజుల క్రితం కైకలూరు మండలం రామవరంలో మందుగుండు పేలి చరణ్, మణి సతీష్, కందాపుల మణికి తీవ్ర గాయాలయ్యాయి.



కైకలూరు మండలం రామవరంలో నాటు తుపాకీ పేలి గాయాలపాలైన వ్యక్తి (ఫైల్)

నల్లమందుతో నాటు తుపాకులు

భాస్వరం, పొటాషియం వంటి పేలుడు పదార్థాలను నూరి నల్లమందును తయారు చేస్తారు. చిన్నపాటి రాపిడి జరిగితేనే పేలే స్వభావం ఉంటుంది. వీటిని నాటు తుపాకుల్లో నింపి గాల్లో పక్షులు వచ్చినప్పుడు కాల్పులు చేస్తుంటారు. ప్రధానంగా తమిళనాడు, రాష్ట్రంలోని సూళ్లూరుపేటకు చెందిన 150 కుటుంబాలు కైకలూరు, ఉండి నియోజకవర్గాల్లో నివాసం ఉన్నాయి. ఆక్వా చెరువుల యజమానులు రోజు కూలికి వీరిని తీసుకు వెళ్తుంటారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు చెరువు వద్ద నాటు తుపాకీతో కాపలా ఉంటే పెద్ద పక్షిని తోలితే రూ.200 నుంచి రూ.300 వరకు ఇస్తుంటారు. అలా కొందరు రూ.1,000 నుంచి రూ.3 వేల వరకు సంపాదించే పరిస్థితి. వీరు చెరువుల వద్దే తాత్కాలిక పాకలు వేసుకుని నివాసం ఉంటారు.

ఏపీఆర్‌జేసీలో 2వ ర్యాంకు



సాయి పర్ణిక

ద్వారకాతిరుమల: ఏపీఆర్‌జేసీ–2025 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ద్వారకాతిరుమలకు చెందిన పాడుదోలు సాయి పర్ణిక రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. అలాగే పాలిసెట్‌లో 37వ ర్యాంక్ సాధించినట్టు తల్లిదండ్రులు రాంబాబు, శ్యామలాదేవి తెలిపారు. సాయి పర్ణిక కామవరపుకోట మండలం తాడిచర్లలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతుండగా, టెన్త్ పరీక్షల్లో 593 మార్కులు సాధించింది. చదువులో రాణిస్తున్న సాయి పర్ణికను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

పీజీఆర్ఎస్ అర్జీకి స్పందన

ఏలూరు (టూటౌన్): పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పందించారు. గురువారం స్థానిక 40వ డివిజన్‌లో పూరింట్లో నివాసముంటున్న పెదపూడి లీలమ్మను కలిసి ఆమె ఇబ్బందులు, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థకు వచ్చిన పూరింటి స్థానంలో నెల రోజుల్లో ఇల్లు నిర్మించి ఇస్తామని, అంత్యోదయ అన్నయోజన కార్డు మంజూరుకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్ ఉన్నారు.

• కదం తొక్కిన సీహెచ్‌ఓలు



విలేజ్ క్లినిక్‌లలో పనిచేస్తున్న సీహెచ్‌ఓలు తమ సమస్యల పరిష్కారం కోసం 18 రోజులుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. గురువారం భీమవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో కదం తొక్కారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినదించారు. - భీమవరం(ప్రకాశంచౌక్)

తనిఖీలు నామమాత్రం.. తవ్వకాలు నిత్యకృత్యం

- పోలవరం కుడి కాలువ గట్టుకు తూట్లు
- నామమాత్రంగా అధికారుల పరిశీలన



ఎం.నాగులపల్లి వద్ద పొక్లెయిన్‌తో తవ్వకాలు

ద్వారకాతిరుమల: పోలవరం కుడి కాలువ గట్టుపై జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై 'సాక్షి'లో ప్రచురించిన వరుస కథనాలకు ఎట్టకేలకు మైనింగ్ విజిలెన్స్ అధికారుల్లో చలనం కలిగింది. అయితే గురువారం అధికారులు చేపట్టిన తనిఖీలు విమర్శలకు తావిచ్చాయి. ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి వద్ద పోలవరం కుడి కాలువ గట్టుపై గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుతూ కూటమి నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై వరుస కథనాలు ప్రచురించగా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఉదయం కాలువ గట్టుపైకి వచ్చిన విజిలెన్స్ అధికారులు ఒక్కచోట మాత్రమే కారు దిగి పరిశీలించారు. అది కూడా అనుమతులు ఇచ్చిన ప్రాంతంలోనే పరిశీలించి.. మిగిలిన రెండు పాయింట్లను పట్టించుకోలేదు. అధికారులు వెళ్లిన కొద్దిసేపటికే అక్రమార్కులు పొక్లెయిన్లు తీసుకువచ్చి యథేచ్ఛగా గ్రావెల్ తవ్వి తరలించారు. గ్రావెల్‌ను కైకలూరు–పామర్రు హైవే రహదారి నిర్మాణం, నారాయణపురంలో చేపల చెరువుల గట్లకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నారు. అధికారుల తనిఖీల సంగతి కూటమి నేతలకు ముందే తెలిసినట్టు సమాచారం. ఇదిలా ఉండగా కాలువ గట్టును తవ్విన ప్రాంతాల్లో భారీ గోతులు కనిపిస్తున్నా అధికారులు ఏమీ లేనట్టు వెళ్లిపోవడం రైతులను విస్మయానికి గురిచేసింది. ఇక పచ్చ నేతలు ఇచ్చే రిపోర్టే.. అధికారుల తుది నివేదిక అవుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

చక్రం తిప్పుతున్న ముగ్గురు పచ్చ నేతలు

ప్రధానంగా గ్రావెల్ దందాలో ముగ్గురు పచ్చ నేతలు చక్రం తిప్పుతున్నారు. అన్ని వ్యవహారాలను వారు మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం.

ఏఎస్సై, హెడ్ కానిస్టేబుళ్ల బదిలీలు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లకు గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ బదిలీల కౌన్సెలింగ్ చేపట్టారు. ఒకే పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లకు పైగా సేవలందిస్తున్న 91 మందికి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎస్సీలో క్రీడా కోటాపై తలోమాట

- క్రీడాకారుల్లో అసంతృప్తి
- నియామక ప్రక్రియపై అనుమానాలు
- క్రీడల వర్గీకరణతో నిరాశ



ఏలూరు రూరల్ : కూటమి ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో క్రీడా కోటా విధి, విధానాలపై క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్‌లో మార్గదర్శకాలు అయోమయానికి గురి చేస్తున్నాయంటున్నారు. ప్రభుత్వ పెద్దలు క్రీడా కోటాలో ఉద్యోగాలను అమ్ముకునేందుకు తప్పుడు విధానాలు రూపొందించారని అనుమానిస్తున్నారు. ఇందుకోసం తమకు అనుకూలంగా క్రీడల విభజన, అర్హతలతో ఆన్‌లైన్ దరఖాస్తు విధానం రూపొందించారని ఆరోపిస్తున్నారు. స్పోర్ట్స్ డీఎస్సీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 421 పోస్టులను భర్తీ చేయనున్నారు.

ట్రైనింగ్ లేకుండా ఉద్యోగాలు ఎలా?

ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ (బీపీఈడీ) పూర్తి చేయని క్రీడాకారులను సైతం స్పోర్ట్స్ కోటాలో వ్యాయామ ఉపాధ్యాయులుగా నియమిస్తామని కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్‌లో వెల్లడించడంపై క్రీడా పండితులు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానం ఇతర శాఖలకు మాత్రమే సరిపోతుందని, ఉపాధ్యాయ వృత్తికి మాత్రం సరికాదంటున్నారు. ట్రైనింగ్ పూర్తి చేయకుండా క్రీడాకారుడు పిల్లలకు వ్యాయామ విద్య ఎలా బోధిస్తాడు? అని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఉపాధ్యాయ కోటాలో ఇలాంటి నియమాలు పెట్టలేదని గుర్తు చేస్తున్నారు. దీని వల్ల ట్రైనింగ్ పూర్తి చేసిన క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని మండిపడుతున్నారు.

గత ప్రభుత్వంలో పక్కాగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల నియామకంలో స్పోర్ట్స్ కోటా అమలు చేశారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 వేల మందికి పైగా క్రీడాకారులు సచివాలయ ఉద్యోగాలు సాధించారు. నాడు ఒక్క క్రీడాకారుడు కూడా విధి, విధానాలపై అభ్యంతరం వ్యక్తం చేయలేదు. అయితే నేడు కూటమి ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ నియామకాలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

జూనియర్ ఇండియా, ఎస్‌జీఎఫ్‌కు ప్రాధాన్యత లేదా?

స్పోర్ట్స్ కోటాలో జూనియర్ ఇండియా చాంపియన్‌షిప్, నేషనల్ స్కూల్‌గేమ్స్ సర్టిఫికెట్స్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులతో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులకు ఉద్యోగాల కల్పనలో ప్రాధాన్యత కల్పించకపోవడంపై క్రీడా విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి పక్కా విధి విధానాలతో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పాయింట్ల విధానంపై గందరగోళం

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా చేపట్టేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాప్) ప్రత్యేక విధానాన్ని రూపొందించింది. ఇందులో భాగంగా క్రీడల ప్రాధాన్యత, క్రీడాకారుడు సాధించిన సర్టిఫికెట్ల స్థాయిని బట్టి పాయింట్లు కేటాయించి ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పూరిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం శాప్ విధానాలకు విరుద్ధంగా క్రీడలను ఏ,బీ అనే రెండు కేటగిరీలుగా విభజించింది. ఎటువంటి క్రీడల సర్టిఫికెట్లు ఉంటే ఎన్ని పాయింట్లు కేటాయిస్తారో? వెల్లడించలేదు. ఒలింపిక్స్, ఏషియా గేమ్స్, కామన్‌వెల్త్, నేషనల్ గేమ్స్, యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ చాటిన వారితో పోస్టులు పూరిస్తామని చెబుతున్నారు. అయితే ఇందులో ప్రాధాన్యత లేని పలు క్రీడలను సైతం ఏ-కేటగిరీలో చేర్చడం వల్ల అత్యంత పోటీ ఉన్న క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి అన్యాయం జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పారదర్శకత లేదు



ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఉద్యోగాల స్పోర్ట్స్ కోటా నోటిఫికేషన్ పారదర్శకంగా లేదు. ఇందులో పక్కా విధి, విధానాలు వెల్లడించాలి. ఇతర ప్రభుత్వ శాఖల్లో సైతం స్పోర్ట్స్ కోటాతో ఉద్యోగాలు పూరించాలి. అప్పుడే ప్రతిభ ఉన్న క్రీడాకారులకు న్యాయం చేసినట్టు అవుతుంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. లేదంటే డీఎస్సీ మొత్తం ప్రక్రియ కోర్టు మెట్లు ఎక్కుతుంది.

– టి.కొండలరావు, శాయ్ సెంటర్ రిటైర్డ్ ఇన్‌చార్జి

తప్పుల తడక



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్పోర్ట్స్ కోటా విధానం తప్పుల తడకగా ఉంది. బీపీఈడీ ట్రైనింగ్ చేయకుండా వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగం ఎలా కేటాయిస్తారు? దీనివల్ల పాఠశాల స్థాయిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ వ్యవస్థ దెబ్బ తింటుంది. క్రీడల వర్గీకరణ సైతం సరిగా లేదు. అంతర్జాతీయ, జాతీయస్థాయిలో అత్యధిక పోటీ కలిగిన క్రీడాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ఇందులో ప్రతిభ చాటిన వారికి పాయింట్లు విధానం అమలు చేయాలి.

–కేటీఎస్ఆర్ అంజనేయులు, రిటైర్డ్ డీఎస్‌డీఓ

క్లుప్తంగా

నూతన ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు చర్యలు



విస్సాకోడేరులో ఫ్లాటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పాలకోడేరు : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా నూతన ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు అన్నారు. గురువారం పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో రూ.10.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఫ్లాటెడ్ కాంప్లెక్స్ (ఇండస్ట్రియల్ పార్క్) నిర్మాణానికి రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చర్యలతో దూదేకుల ముస్లింలకు అన్యాయం



షేక్ హుస్సేన్ బీబీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి ప్రభుత్వ అసమర్థత వల్ల దూదేకుల ముస్లిం మైనార్టీలు నష్టపోతున్నారని నూర్ భాషా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు షేక్ హుస్సేన్ బీబీ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో గురువారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల పైబడి జనాభా ఉన్నటువంటి నూర్ భాషా ముస్లిం మైనారిటీల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్‌లో బీసీ–బి దూదేకుల ఆప్షన్ లేని కారణంగా మైనార్టీ సబ్సిడీ రుణాలు, మైనార్టీ కోటాలో వచ్చే ఇతర ప్రయోజనాలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నూర్ బాషా ముస్లింలపై కేవలం ఓట్లు కోసమే ప్రభుత్వం కపట ప్రేమ చూపిస్తుందని మండిపడ్డారు.

కొల్లేరు సరస్సు పరిరక్షణపై సమీక్ష



కొల్లేరు పరిరక్షణ చర్యలను జెడ్పీ చైర్‌పర్సన్‌కు వివరిస్తున్న అధికారులు

ఏలూరు(మెట్రో): సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చేపట్టిన లిడార్ సర్వే ఆధారంగా అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు వేగవంతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులకు సూచించారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో కొల్లేరు సరస్సు పరిసరాలలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల తొలగింపు చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు, డ్రెయిన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు వారి శాఖల ద్వారా చేపట్టిన ముందస్తు చర్యల గురించి వివరించారు. కొల్లేరులో 67 మినీ డ్రెయిన్ చానల్స్ ఉన్నాయని, అందువల్ల ముంపు బారిన పడకుండా వాటి పూడికతీత పనుల ప్రతిపాదనలు తయారు చేసి అటవీశాఖ ద్వారా ప్రభుత్వ అనుమతి కోసం పంపాలని కోరారు. సమావేశంలో డివిజనల్ ఫారెస్ట్ ఆఫీస్ బి.విజయ, డ్రెయిన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

'ధాన్యంలో తేమ 17 శాతం ఉండాల్సిందే'



అత్తిలిలో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న పౌర సరఫరాల జిల్లా అధికారి డి.శివరాంప్రసాద్

అత్తిలి: రైతులు పంట కోసిన వెంటనే తేమ తనిఖీ చేసి 17 శాతం ఉన్నప్పుడే మిల్లులకు తరలించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి డి శివరాంప్రసాద్ చెప్పారు. గురువారం అత్తిలి మండలంలో ఆయన పర్యటించి ధాన్యం రాశులను పరిశీలించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం ఎక్కువగా ఎండబెడితే నూక శాతం పెరుగుతుందని, 17 శాతం ఉన్నప్పుడే మిల్లులకు పంపే ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం అర్బన్ : విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలో కలకలం రేపింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సరవ సూరిబాబు (38) అనే వ్యక్తి పట్టణంలోని స్వీట్స్ దుకాణానికి సంబంధించిన స్వీట్స్ తయారు చేసే యూనిట్‌లో రోజు కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఆ ప్రాంతంలో గ్రైండర్ స్విచ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌తో పడిపోయాడు. ఇది గమనించిన తోటి పనివారు బాధితుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి సూరిబాబు మృతి చెందినట్లు నిర్ధారించారు. సూరిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలాశయంలోనూ అక్రమ తవ్వకాలు



కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయంలో గ్రావెల్ కోసం తవ్వేసిన గోతులు

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా పార్టీల నేతలు మట్టి, ఇసుక అక్రమ రవాణాకు తెరతీశారు. చెరువుల్లో మట్టిని అక్రమంగా తరలించుకుపోతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పుడు ఏకంగా జలాశయంలో అక్రమ తవ్వకాలు చేయడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయంలో అక్రమంగా తవ్వకాలు చేయడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. చక్రదేవరపల్లికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఈ గ్రావెల్‌ను తవ్వేసి, అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం నుంచి వయా చక్రదేవరపల్లి మీదుగా వేగవరానికి ఇటీవల రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డుకు ఇరువైపులా బెర్మలను నిర్మించేందుకు ఈ మట్టినే ఉపయోగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలపై ఎర్రకాలువ జలాశయం ఏఈ ఆర్.శ్రీనివాస్‌ను వివరణ కోరగా జలాశయం సమీపంలో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. తవ్వకాల విషయం తమ దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

లింగపాలెం: కారు–మోటర్‌సైకిల్ ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం ధర్మాజీగూడెంలో చోటు చేసుకుంది. ధర్మాజీగూడెంలో టైర్ పంక్చర్‌లు దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ఎస్‌కే అహ్మద్ (36) ద్విచక్ర వాహనంపై వస్తుండగా, రాంగ్ రూట్‌లో వచ్చిన కారు ఢీకొట్టింది. అహ్మద్ తన భార్యతో కలిసి ఏలూరు నుంచి ధర్మాజీగూడెం తన ఇంటికి వస్తుండగా ధర్మాజీగూడెం శివారులో కోనేరు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అహ్మద్ తీవ్ర గాయాలు కాగా, భార్య ఆస్మ నడుం విరిగిపోయింది. దీంతో వారిద్దరిని ఏలూరు ఆసుపత్రికి తరలించగా, అహ్మద్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఆస్మకు వైద్యచికిత్స అందిస్తున్నారు. అహ్మద్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వ్యక్తిపై దాడి.. ఏడుగురిపై కేసు

ఏలూరు టౌన్: ఓ కిడ్నాప్ కేసులో నిందితుల మధ్య జరిగిన వాగ్వివాదం ఏకంగా దాడుల వరకు వెళ్లింది. ఏలూరు నగరంలో రెండేళ్ల క్రితం ఒక కిడ్నాప్ కేసులో బాలిబోయిన నవ హర్ష అనే వ్యక్తితో సహా మరో ఏడుగురు నిందితులుగా ఉన్నారు. అయితే ఈ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో వాయిదాలకు తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఏడుగురు నిందితులు నవహర్ష వద్దకు వెళ్లి వాయిదాలకు వెళ్లేందుకు డబ్బు ఇవ్వమని కోరారు. అతడు లేవడంతో వాగ్వివాదానికి దిగి నవహర్షపై దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో గురువారం నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టి, 35(3) బీఎన్ఎస్ నోటీసు ఇచ్చామని ఎస్సై నాగబాబు తెలిపారు. నిందితులను తర్వలో బైండోవర్ చేస్తామని స్పష్టం చేశారు.



మల్లప్ప దిబ్బలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



పెనుగొండ వడలి రహదారిలో నేలకొరిగిన వృక్షాలు

ఈదురు గాలుల బీభత్సం

ఎండలు మండుతున్న వేళ పెనుగొండ, పెనుమంట్ర మండలాల్లో గురువారం భారీ వర్షం కురవడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. పెనుగొండలో ఈదురుగాలులు, భారీ వర్షం బీభత్సం సృష్టించింది. పెనుగొండ, వడలి, వెంకట్రామపురం గ్రామాల్లో ఈదురుగాలులకు భారీ వృక్షాలు నెలకొరిగాయి. మార్టేరు– పెనుమంట్ర స్టేట్‌హైవే రోడ్డుపై కొన్ని చోట్ల చెట్లు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. అయితే భారీ వర్షం నేపథ్యంలో రైతులు కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని రక్షించుకోవడానికి అవస్థలు పడ్డారు. – పెనుగొండ/పెనుమంట్ర

వేప ఉత్పత్తులు.. కీటక నాశకాలు

- వేప నూనె, పిండితో పంటలకు రక్షణ
- సేంద్రియ పద్ధతుల్లో వాడుతున్న రైతులు

పాడి - పంట

బుట్టాయగూడెం : తరతరాల నుంచి వేప చెట్టుకు ఒక ప్రత్యేకత ఉంది. వేప చెట్టులో ప్రతి భాగం ఒక్కో విశిష్టత కలిగి ఉంటుంది. వేప చెట్టులోని భాగాలు వైద్యంతోపాటు వ్యవసాయ సాగులో, పంటల్లో చీడ పీడల నివారణలో ఎంతగానో ఉపయోగపడతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రకృతిపరంగా లభించే వేపపిండి, వేప నూనె, కొమ్మలను సేంద్రీయ ఎరువుల పద్ధతిలో రైతులు వాడుతుంటారు. వేప పిండి, కొమ్మలు భూమిని సారవంతం చేయడంతో పాటు పంట దిగుబడి పెంచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పలు రకాల వేప ఉత్పత్తులను వాటి ఉపయోగాలను వ్యవసాయాధికారులు రైతులకు ముందుగానే వివరిస్తున్నారు.

ప్రయోజనాలివీ

- వేప ఆకులు లేదా ఆకు కొనలు పొడి చేసి నిల్వ చేసే ధాన్యంలో కలిపితే పురుగులు పట్టవు.
- వేప ఆకుల కషాయంలో ముంచి ఆరబెట్టిన గోనుసంచులకు పురుగులు దరిచేరవు.



వేప చెట్టు



వేప కాయలు

- ఎరువుగా వేపాకులు పొలంలో వేస్తే సేంద్రియ పదార్థం, పోషకాలతోపాటు నిరోధక శక్తి కలిసి వస్తాయి.
- వేప నూనె పంటలపై పిచికారీ చేస్తే కాయ తొలుచు పురుగు, రసం పీల్చు పురుగు, ఆకు తినే పురుగులను అదుపు చేయవచ్చు.
- ఒక లీటర్ వేప నూనెకు 200 లీటర్‌ల నీరు, 200 గ్రాముల సబ్బుపొడి(సర్ఫ్)ను కలిపి ద్రవణం తయారు చేసుకోవాలి. ఇది ఒక ఎకరంలో స్ప్రేయింగ్ చెయ్యడానికి సరిపోతుంది. నూనె, నీరు కలువదు కనుక ముందుగా సబ్బుపొడి బాగా కలిపి నురగ వచ్చిన తర్వాత నీటిలో కలపాలి.
- వేప పిండి మేలైన చిక్కటి సేంద్రీయ ఎరువు. గింజ నుంచి తీసి వేసిన వేప పిండిలో 5.2 శాతం నత్రజని, 11 శాతం భాస్వరం, 1.5 శాతం పొటాషియం ఉంటుంది. ఇది ఎరువుగానే కాకుండా సస్య రక్షణకు ఉపయోగపడుతుంది.

వేప ఉత్పత్తులతో పర్యావరణ ప్రయోజనాలు



వ్యవసాయంలో వేప ఆధారిత ఉత్పత్తులను వినియోగించడం వల్ల అనేక పర్యావరణ ప్రయోజనాలు లభిస్తాయి. వేప జీవనాధారణ పొందుతుంది. పర్యావరణ వ్యవస్థలో పేరుకుపోదు. కాలుష్య ప్రమాదాన్ని తగ్గిస్తుంది. వేప నేల నాణ్యతను పెంచుతుంది. ఆరోగ్యకరమైన, స్థితి స్థాపక వ్యవసాయ వ్యవస్థను ప్రోత్సహిస్తుంది.

– డి.ముత్యాలరావు, ఏఓ, బుట్టాయగూడెం

లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న గీతాబాయి

భీమవరం (ప్రకాశంచౌక్) : జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. గురువారం ఆమె అధ్యక్షతన జిల్లా స్థాయి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కమిటీ సలహా సంఘం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాబాయి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆడ పిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంత ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.

రేపు ఏలూరులో ప్రత్యేక ఉద్యోగ మేళా

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలోని ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో, నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) సంయుక్త భాగస్వామ్యంతో శనివారం ఉదయం 10:30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయం, ఏలూరులో ప్రత్యేక ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణ్ రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాల నిమిత్తం ఇంటర్వ్యూలలో పాల్గొనాలనుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఫార్మల్ డ్రెస్ కోడ్‌లో, రెజ్యూమ్, సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలను కోసం 88868 82032 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

దెందులూరు: పెద్దలు కుదిర్చిన పెళ్లి సంబంధం చేసుకోవడం ఇష్టం లేక ఆత్మహత్యాయత్నం చేసిన మౌనిక అనే యువతి చికిత్స పొందుతూ మృతి చెందిందని దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపారు. వీరభద్రపురం గ్రామానికి చెందిన గొట్టికల మౌనిక అదే గ్రామానికి చెందిన యువకుడితో కుటుంబ సభ్యులు పెళ్లి కుదిర్చారు. అయితే ఈ పెళ్లి ఇష్టం లేకపోవడంతో ఈ నెల 12న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న యువతి గురువారం మృతి చెందింది. ఈ మేరకు ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



బాస్కెట్ బాల్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు



వేసవిలో చిన్నారులకు ఆటవిడుపు

వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్‌లో శిక్షణ ఇస్తున్నారు. చిన్నారులకు బాస్కెట్‌బాల్‌లో మెలకువలు, పోటీపడేతత్వాన్ని నేర్పిస్తున్నారు. 12 ఏళ్ల నుంచి పెద్ద వయస్సు ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉచితంగా ఈ శిక్షణ ఉంటుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోచ్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు





క్లుప్తంగా

ఘనంగా పైళ్లమ్మ జాతర మహోత్సవాలు



విశేష అలంకరణలో గ్రామ దేవత పైళ్లమ్మ అమ్మవారు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో ఏడేళ్ల కోసారి జరిగే గ్రామ దేవత పైళ్లమ్మ అమ్మవారి ఉత్సవాలు గ్రామంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవాలలో భాగంగా తొలిసేవ 8న నిర్వహించగా మలిసేవాకార్యక్రమం 15న రాత్రి కన్నుల పండువగా నిర్వహించనున్నారు. సందర్భంగా గురువారం అమ్మవారి పూరిగుడి వద్ద ఉదయం మంగళ స్నానాలు చేయించారు. అనంతరం పసుపు, కుంకుమ, సాంబ్రాణిలతో ప్రత్యేక పూజలు చేశారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి



సీపీఐ శాఖ మహాసభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వం ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని, సూపర్ సిక్స్ పథకాలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. పట్టణంలోని యాగర్లపల్లి సీపీఐ శాఖ మహాసభ గురువారం పూడి శ్యామల అధ్యక్షతన జరిగింది. సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భావం, చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను ప్రస్తావించారు. పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మూడు వెంకట్రావు, వడ్డాది మేరీ, పూడి సుబ్బారావు, గొంగాడ సత్యనారాయణ, పూడి మోహన్‌రావులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత



పెంటపాడులో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిడ్స్ పై అవగాహన ఉంటే ప్రాణాలు దక్కించుకోవచ్చునని ఎయిడ్స్ నియంత్రణ మండలి కళాజాత సభుడు ఎం.రవిబాబు అన్నారు. పెంటపాడులో గురువారం ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని డప్పు కళాకారులతో ఎయిడ్స్ వ్యాధి, సోకే విధానం, నివారణ, చికిత్స, ఐసీటీఎస్ కేంద్రం అవశ్యకత, ఏఆర్‌టీ సెంటర్ ప్రాధాన్యత, హెచ్ఐవీ టోల్‌ఫ్రీ నెంబర్ 1097 తదితర అంశాలపై అవగాహన చేశారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు పీహెచ్‌సీ స్టాఫ్, గుడ్ ల్యాంప్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళకు వీల్ చైర్ బహూకరణ



బంగారుగూడెం గ్రామానికి చెందిన నాగలక్ష్మికి వీల్ చైర్ అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం గ్రామానికి చెందిన వీరమళ్ల నాగలక్ష్మి నడవలేని స్థితిలో ఉండటంతో ఆమెకు రుషి సేవా ట్రస్ట్ వీల్ చైర్‌ను గురువారం అందజేశారు. నాగలక్ష్మి పరిస్థితిని గుర్తించిన సచివాలయ మహిళా పోలీస్ తమ్మిశెట్టి ఉషోదయ రుషి సేవా ట్రస్ట్ వారిని సంప్రదించగా, వారు స్పందించి ఈ వీల్ చైర్‌ను సమకూర్చారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి తల్లి గంగారత్నం వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ చిక్కా సత్యనారాయణ, కార్యదర్శి వి.సోమేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద కుటుంబానికి సాయం



చినతాడేపల్లి గ్రామంలో బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అబ్రహాం ఇల్లు దగ్ధమైంది. ఈ సందర్భంగా గురువారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరామర్శించి, ప్రభుత్వపరంగా రూ.5వేలు నగదు, బియ్యంతో పాటు మరో రూ.10వేలను వ్యక్తిగత సాయంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబం ఇంటి నిర్మాణానికి రుణ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

చెత్తకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు

- ప్రమాదం అంచున ప్రజారోగ్యం
- రహదారి అంచులే డంపింగ్ యార్డులు
- మచ్చుకైన కానరాని స్వచ్ఛభారత్





కె. పెంటపాడు సచివాలయం వద్ద రిక్షాలో చెత్త, అదే స్థలం వద్ద శ్మశాన వాటికకు వెళ్లే దారిలో చెత్తకు నిప్పుపెట్టిన దృశ్యం

పెంటపాడు: పట్టణం..పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగత పలుకుతుంది. పట్టణం..పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగతం పలుకుతోంది. రోడ్ల పక్కన నిలుచునే పరిస్థితి లేని తీరు కలవరపెడుతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో దయనీయ స్థితి నెలకొంది. ప్రధాన రహదారులు అంచులనే మున్సిపల్, గ్రామ పంచాయతీలు డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నాయి.

చెత్తకు నిప్పు పెట్టడంతో...

అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో చెత్త కుప్పలకు నిప్పు పెట్టి వదిలివేయడంతో తడిగా ఉండటంతో వీటి నుంచి వచ్చే పొగతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. పలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. రహదారిని అనుకొని ఉన్న గ్రామాల వద్ద చెత్త కుప్పలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. దోమలు విజృంభించి వ్యాధులు బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య, కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణం, గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలో, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో పట్టణంలోని, మండలాల్లోని గ్రామాల్లో వీధులు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికి నెలవుగా మారింది. దీంతో స్థానికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.

వ్యర్థాలన్నీ రోడ్ల పక్కనే..

మండలంలోని జాతీయ రహదారి ఇరువైపులా



పెంటపాడు కళాశాల సెంటర్‌లో బస్తాలతో చెత్త దృశ్యం

చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తకుప్పల వలన అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గాలి వీచినప్పుడు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు చెత్త నుంచి కాగితాలు, పాలిథీన్ కవర్లు ఎగురొచ్చి వాహనాలపై పడుతుండడంతో డ్రైవర్లు వాటిని తీయబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా నిల్వ పదార్థాలను రోడ్డుపై వేయడంతో ప్రజలు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవేకాకుండా ఖాళీ కొబ్బరి బొండాలు, కోళ్లు, చేపల వ్యర్థాలు కూడా ఇక్కడే పడేస్తున్నారు. ఈ రహదారి ఇరువైపులా రాకపోకలు సాగించే వారికి నిత్యం ఆగచాట్లు తప్పడం లేదు. రాత్రిళ్లు వాహనాల వేగంతో పాటు ఈచెత్తనుంచి వచ్చే చెడు వాసనలు భరించలేకపోతున్నామని వాపోతున్నారు. పెంటపాడులో గూడెం- భీమవరం రోడ్డులో ప్రధానంగా డీఆర్‌గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోస్టుబేసిక్‌స్కూలు ఉన్న ప్రాంతాలో చెత్తను వారం రోజుల నుంచి తరలించక పోవడంతో కుళ్లి పోయిన మామిడి కాయలతో దుర్వాసన వెదజల్లుతోంది. అటుగా వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్కూలు, కళాశాల విద్యార్థులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తక్షణం చెత్తను తరలించి, పేరుకుపోయిన చెత్తకు నిప్పుపెట్టకుండా పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ కార్డుల సర్వీసులను సద్వినియోగం చేసుకోండి

తణుకు అర్బన్: రేషన్ కార్డులకు సంబంధించి 7 రకాల సర్వీసులను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రారంభామని, ఆ సర్వీసులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డి.అశోకవర్మ తెలిపారు. కొత్త రేషన్‌కార్డు, స్ప్లిట్టింగ్ రేషన్ కార్డు (కొత్తగా వివాహం అయిన వారు), మెంబర్ యాడింగ్ (పిల్లల పేర్లు నమోదుచేయుట), మెంబర్ డిలీషన్ (చనిపోయిన వారి పేర్లు మాత్రమే), రేషన్ కార్డు అడ్రస్ మార్పు, సరెండర్ కార్డు (రేషన్ కార్డు రద్దు చేయట), రేషన్ కార్డులో ఆధార్ నంబరు తప్పుగా నమోదైన వారికి సరిచేయుట వంటి సర్వీసులు తణుకు మండలంలోని అన్ని గ్రామాల్లోని సచివాలయాల్లోను జరుగుతున్నాయని, సంబంధిత ధ్రువపత్రాలను జతపరచి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో జెడీపీహెచ్ ఫీడర్‌కు సంబంధించి, హౌసింగ్ బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో వీకర్స్‌కాలనీ ఫీడర్‌కు సంబంధించి ఆయా విద్యుత్ లైన్‌లకు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 16వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. వన్ టౌన్‌లోని మెయిన్‌రోడ్డు, మసీదు రోడ్డు, వీకర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, అబ్బులు కొట్టు సెంటర్, సత్యవతినగర్, ఆరు కొట్టుల సెంటర్‌లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

నరసాపురం రూరల్: ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. నరసాపురం మార్కెట్ యార్డులో ఉన్న సివిల్ సప్లై గోడౌన్ వద్ద సివిల్ సప్లై కార్మికులతో కలిసి ఆయన ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యూటి, పని గంటలు, యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె మొదలగు చట్టాలన్నిటినీ కేంద్రంలోని బీజేపీ నీరుగార్చుతోందని ఆరోపించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని



సమ్మె పోస్టర్ విడుదల చేసిన నాయకులు

నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నోముల కొండ సివిల్ సప్లయి కార్మిక నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, రవి, మల్లుల రామ చక్రవర్తి, గుత్తుల రఘుబాబు, అరవ సత్యనారాయణ, ఆకన దుర్గారావు, ఆకన శ్రీనివాస్, ఆకన రాంబాబు, మేడిది రమేష్, గుడిపాటి సత్యనారాయణ, కైలా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల డేటా అందించాలి

నరసాపురం: పట్టణంలో వీధి వ్యాపారుల డేటా అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య అన్నారు. వార్డు వెల్ఫేర్ కార్యదర్శులు వీధి వ్యాపారుల వద్దకు వెళ్లి సమాచారం సేకరించి ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫ్యామిలీ ఫొటో కార్యదర్శులకు అందించి సహకరించాన్నారు.

కారుమూరి పరామర్శలు



వేల్పూరులో గుణ్ణం వెంకటరామన్నను పరామర్శిస్తున్న మాజీమంత్రి కారుమూరి

తణుకు అర్బన్, అత్తిలి : వైఎస్సార్ సీపీ వేల్పూరు గ్రామ నేత గుణ్ణం వెంకటరామన్న భార్య సత్యవతి ఇటీవల మృతిచెందడంతో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు గురువారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. సత్యవతి మృతికి సంతాపం తెలిపారు. పార్టీ నేతలు పి.వెంకటరామన్న, ఎస్.దుర్గాప్రసాద్ ఆయన వెంట ఉన్నారు. అత్తిలి మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు మామ వెంకటరామారావు, పార్టీ నేత దామిశెట్టి కృష్ణ తల్లి, పార్టీ కుక్కల రమణ తల్లి ఇటీవల మృతిచెందడంతో కారుమూరి వారి కుటుంబాలను పరామర్శించారు.

3ఎఫ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా 3ఎఫ్ ఇండస్ట్రీస్ పేదలకు అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కర్మాగార డైరెక్టర్ సీమా గోయంకా పేర్కొన్నారు. గురువారం పెంటపాడు మండలం ప్రత్తిపాడు ఎస్సీపేట, కాగులంపాడు రోడ్డులోని పద్మావతి కాలనీ ప్రాంతాలలో రూ.13 లక్షలతో నిర్మించిన రెండు వాటర్ ప్లాంట్‌లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పేదలకు వాటర్‌టిన్నులు బహుకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్రిపుల్ కర్మాగారం ద్వారా చిన్నారులకు గుండె ఆపరేషన్‌లు, మహిళలకు బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్ శిక్షణతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాలైన పలు గ్రామాలలో బస్సు షెల్టర్‌లు, సీసీ కెమెరాల ఏర్పాటు, రూ. 12 లక్షలతో జువ్వలపాలెంలో శ్మశానం అభివృద్ధి తదితర సేవాకార్యక్రమాలు ఇటీవల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ 3ఎఫ్ సేవలను కొనియాడారు. సంస్థ ఎండీ ఓపీ గోయంకా, జీఎం(హెచ్ఆర్) జనార్ధన్, సహాయమేనేజర్ శ్రీనివాసరెడ్డి, సీఎస్ఆర్ వేమాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. జువ్వలపాలెం శ్మశాన అభివృద్ధి చేసిన గోయంకా ప్రతినిధులు గేట్ తాళాలను జువ్వలపాలెం గ్రామస్తులకు అందజేసారు. దీంతో గ్రామస్తులు త్రిపుల్‌ఎఫ్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ప్రత్తిపాడులో వాటర్‌ప్లాంట్‌లను ప్రారంభిస్తున్న దృశ్యం

మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

తణుకు అర్బన్: ఏళ్ల తరబడి విధుల్లో ఉన్న మునిసిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మునిసిపల్ మస్తరు పాయింట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గత 20 సంవత్సరాల కాలం నుంచి ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ మునిసిపల్ కార్మికులు జీవితాల్లో ఎలాంటి మార్పులు లేవని విమర్శించారు. సుప్రీం కోర్టు మాట సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినప్పటికి ప్రభుత్వాలు అమలు చేయక పోవడం బాధాకరమని, ప్రభుత్వమే కనీస వేతనం, చట్టాలు అమలు చేయక పోతే ప్రైవేట్ వాళ్లు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కార్మికులు న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. ఈ నెల 20న జరిగే సమ్మెలో కార్మికులంతాపాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, రమేష్, మంగమ్మ, అయ్యప్ప, కృష్ణబాబు, సుమ, కొమరరాణి, కేశవ, నాగరాజు,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తణుకులో నిరసన తెలుపుతున్న కార్మికులు

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



అత్తిలిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న దృశం

అత్తిలి: ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు సర్ అర్థర్ కాటన్ అని అత్తిలి శాఖా గ్రంథాలయాధికారి డి కృష్ణారావు అన్నారు. గురువారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో కాటన్ జయంతిని నిర్వహించారు. కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మాణం ద్వారా ఈప్రాంతం బంగారుమయం అయిందని గ్రంథాలయాధికారి అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు నెహ్రూ జీవితచరిత్ర, నేటి సమాజంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గంధం శేషవేంద్రరావు, డేవిడ్‌రాజు, బి నాగేశ్వరరావు, బి అవతార మూర్తి, వి లక్ష్మణరావు, పి వెంకటేశ్వరరావు, ఎస్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరం జరిగింది. రిసోర్స్‌పర్సన్లుగా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే పుస్తకాలు సమీక్ష, ఇతర అంశాలు, కోపల్లె శ్రీనివాస్‌రావుచే పంచ మహాయజ్ఞంలపై పిల్లలకు ఆయా వివరాలను వెల్లడించారు. జి.బాపయ్య శర్మచే సిపాయిలు పోరాటంపై అవగాహన చేశారు. గంథాలయాధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

ఇంటి స్థలాలకు దరఖాస్తులు స్వీకరించాలి

తాడేపల్లిగూడెం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి ఇంటి స్థలాలకు దరఖాస్తులు స్వీకరించాలని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్ కుమార్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. గతంలో ఎప్పుడూ ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం, ఇల్లు పొందని వారు అర్హులుగా పేర్కొన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఎం.వెంకటేష్, హౌసింగ్, రెవెన్యూ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్

గూడెంలో 35.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో గడిచిన 24 గంటల్లో 35.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ గురువారం తెలిపారు.

తణుకు ఆసుపత్రికి బాలబాలికలు


యలమంచిలి: రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలో అనారోగ్య సమస్యలు ఉన్న బాల బాలికలను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని లంకలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి అడ్డాల ప్రతాప్ కుమార్ అన్నారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి కళ్లు, పల్లు, చర్మం, చెవి, ముక్కు, గొంతు ఇతర అనారోగ్య సమస్యలు ఉంటే ప్రత్యేక వైద్య పరీక్షల నిమిత్తం తణుకు జిల్లా ఆసుపత్రికి పంపుతామని చెప్పారు. గురువారం లంకలకోడేరు పీహెచ్‌సీ నుంచి తణుకు ఆసుపత్రికి పలువురు బాల బాలికలను పంపినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, ఫార్మసిస్ట్ పాటబళ్ల వెంకటస్వామి, స్టాఫ్ నర్స్ ముత్యవల్లి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకు జిల్లా ఆసుపత్రికి బాలబాలికలను పంపిస్తున్న డాక్టర్ ప్రతాప్ కుమార్

వైభవంగా ఆలయ పునర్నిర్మాణం

కాళ్ల: మండలంలోని జక్కరంలో ప్రసిద్ధ దేవాలయం శ్రీరామ లింగేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్, పాతపాటి శ్రీనివాసరాజు, కోపల్లె సొసైటీ మాజీ అధ్యక్షుడు నంద్యాల రామరాజు మాట్లాడుతూ గ్రామంలోని పెద్దలు ప్రభుత్వ నిధులతో ఆలయ పునర్నిర్మాణం చేసుకోగలిగామన్నారు. ఆలయ చైర్మన్ నంబూరి సతీష్ రాజు మాట్లాడుతూ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో సీజీఎఫ్ నిధుల ఏర్పాటుకు దివంగత మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు

బస్టాండ్‌లో షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం(ప్రకాశంచౌక్): ఆర్టీసీ బస్టాండ్ పరిధిలోని 15 షాపులకు, ఉండి, కాళ్లలోని రెండు షాపులకు టెండర్ దరఖాస్తులు చేసుకోవచ్చని ఆర్టీసీ డిపో మేనేజర్ పి.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 22వ తేదీ లోగా ఏలూరులోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవాలని, 23న మధ్యాహ్నం రెండు గంటల లోపు టెండర్ ఫారాలను బాక్స్‌లో వేయాలని, మధ్యాహ్నం టెండర్‌దారుల సమక్షంలో బాక్సులను తెరుస్తారని తెలిపారు.

పుష్కరయాత్రకు తరలి వెళ్లిన స్పెషల్ బస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పవిత్ర సరస్వతీ నది పుష్కరాలు రాష్ట్రంలో దగ్గరగా కాళేశ్వరంలో మహా వైభవంగా గురువారం ప్రారంభం కాగా పుష్కర స్నానాలు నిమిత్తం ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థచే తాడేపల్లిగూడెం డిపో నుంచి 2+2 పుష్ బ్యాక్ సరికొత్త సీట్లతో సూపర్ లగ్జరీ బస్సు రాత్రి భక్తులు, ప్రయాణీకులతో తరలివెళ్లింది. డిపో మేనేజర్ వై.సత్యనారాయణ మూర్తి యాత్రను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వరంగల్ భద్రకాళి మాత సందర్శనం తదుపరి వేములవాడ శ్రీ రాజ రాజేశ్వరీ అమ్మవారి దర్శనం, కొండగట్టు ఆంజనేయ స్వామి సందర్శనం, అనంతరం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ దర్శనం, అనంతరం కాళేశ్వరం చేరి మహాకాళేశ్వరుని దర్శనం, పవిత్ర పుష్కర స్నానం తదుపరి రామప్ప దేవాలయం దర్శనం చేయిస్తామని తెలిపారు. తిరిగి బస్సు ఈ నెల 18వ తేదీ ఆదివారం తెల్లవారుజామున తాడేపల్లిగూడెం చేరుతుందని వెల్లడించారు. టికెట్ ఛార్జీ ఒకొక్కరికి కేవలం రూ 2100 మాత్రమేనని తెలిపారు.



పుష్కరయాత్రకు తరలివెళ్తున్న స్పెషల్ బస్సు